కమనీయం.. గోదా కల్యాణం

- విశేషంగా ఎదురుసన్నాహోత్సవం
- శ్రీకృష్ణుడి అలంకరణలో అప్పన్న
- వెంకటాద్రికి పోటెత్తిన భక్తులు



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తజనం

సింహాచలం: భోగి పర్వదినం పురస్కరించుకుని పలు ఆలయాల్లో గోదా కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి వేదికపై అధిష్టంపజేశారు. కల్యాణ మహోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. భక్తులు కల్యాణం వీక్షించి తరించారు.

సింహగిరిపై..

సింహగిరిపై గోదా రంగనాథుల కల్యాణం శనివారం సాయంత్రం కనుల పండువగా జరిగింది. వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని శ్రీకృష్ణుడిగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్టంపజేశారు. గోదాదేవి అమ్మవారిని మరో పల్లకిలో వేంచేయజేసి మాడ వీధుల్లో తిరువీధిగా తీసుకెళ్లి ఎదురు సన్నాహోత్సవం విశేషంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కల్యాణమండపంలో స్వామి, అమ్మవార్లను అధిష్టంపజేసి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు కల్యాణం నిర్వహించారు. కాగా ఎదురు సన్నాహోత్సవంలో అర్చకులు పూలదండలతో నృత్యాలు చేస్తూ అలరించారు. పలువురు కళాకారులు గోదాదేవి, శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో అలరించారు.

కమనీయం

సింహాచలం: భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీగోదా రంగనాథుల కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తిని రంగనాథుడిగా.. గోదాదేవిని పెళ్లికూతురుగా ముస్తాబు చేశారు. శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులకు విశేష అలంకరణ చేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా జరిపారు. అర్చకులు శ్రావణ్, భార్గవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వెంకటాద్రిపై..

పెందుర్తి వెంకటాద్రిపై గోదాకల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. గోదాదేవి, రంగనాథుడిని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణం తనివితీరా తిలకించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం, కల్యాణ అక్షింతలను అర్చకులు అందజేశారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది.

- 93వ వార్డు పరిధి సింహపురికాలనీలోని రామాలయంలోను, లక్ష్మీనరసింహనగర్‌లోని గోపిజనవల్లభ స్వామి ఆలయంలో గోదాకల్యాణం ఘనంగా నిర్వహించారు. అలాగే పెందుర్తి అలివేలిమంగమ్మ ఆలయం, పాత పెందుర్తి రామాలయం, ఎస్ఆర్‌పురంలోని యాదవ సంఘం ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణోత్సవాలు వైభవంగా జరిగాయి.



సింహగిరిపై స్వామికి యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



కల్యాణం తిలకిస్తున్న భక్తులు



వెంకటాద్రిపై గోదాకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు రామానుజమ్

క్లుప్తంగా

వృద్ధులకు సరకులు, దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు, నిత్యావసర సరకులు అందజేస్తున్న కర్రి అప్పలస్వామి

సింహాచలం: సంక్రాంతి పండగ పురస్కరించుకుని అడవివరంలో కర్రి అప్పలస్వామి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కర్రి అప్పలస్వామి కాపువీధిలో నివాసం ఉంటున్న వృద్ధులకు నిత్యావసర సరకులు అందజేశారు. 25కిలోల బియ్యం, పదికేజీల కందిపప్పు, ఐదు లీటర్ల నూనె, ఐదు కిలోల బెల్లం, 5కిలోల మినపప్పు, 5కిలోల పంచదార తదితర వస్తువులతో పాటు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 98వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ



టాస్ వేసి టోర్నీ ప్రారంభిస్తున్న వెంకటరావు

సబ్బవరం: సంక్రాంతి సందర్భంగా అంతకాపల్లి శివారు రావలమ్మపాలెంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీని శనివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలతో పాటు ట్రోఫీలను అందజేయనున్నట్టు చెప్పారు. సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తీరిన శ్మశాన వాటిక సమస్య



శ్మశాన వాటిక స్థల పత్రాలు పెద్దలకు అప్పగిస్తున్న సర్పంచ్ సుజాతముత్యాలు

పరవాడ: ముత్యాలమ్మపాలెం శివారు సమ్మెంగపాలెం గ్రామ ఎస్సీ కాలనీవాసులకు శ్మశానవాటిక సమస్య తీరింది. శ్మశానవాటిక లేక ఈ కాలనీ వాసులు చాలా కాలం నుంచి ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ప్రజలు సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన శ్మశానవాటికకు అవసరమైన స్థలం మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబరు 319లో 0.50 సెంట్ల స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించారని సర్పంచ్ సుజాతముత్యాలు తెలిపారు. దీంతో సమ్మెంగపాలెం ఎస్సీ కాలనీనాయకులు ఎస్.సోమేశ్వరావు, ఈ.లక్ష్మీప్రసాద్, కె.చినసోమేశ్వరరావు, ఎస్.అప్పలరాజు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

క్రికెట్ కిట్ అందజేత



క్రికెట్ కిట్ అందజేస్తున్న చిన్న

పరవాడ: క్రీడల్లో రాణిస్తూ పేరు ప్రతిష్టలు తీసుకురావాలని మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న అన్నారు. తన సొంత నిధులతో సమకూర్చిన క్రికెట్ కిట్‌ను శనివారం రావాడ శివారు బొట్టవానిపాలెం యూత్ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సారిపల్లి జోగినాయుడు, వైస్ సర్పంచ్ కావలి అప్పలరాజు, పెద్దలు సాలాపు రమణారావు, బి.నూకరాజు పాల్గొన్నారు.

రేపు రాధామాధవ స్వామి పండగ

పెదగంట్యాడ: పాత గంగవరంలో కొలువుదీరిన రాధామాధవస్వామి పండగను సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా కనుమ పండగ రోజు స్వామి వారి పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 500ఏళ్ల నాటి ఆలయంలో పూజలు చేస్తే సంపదలతో పాటు కోర్కెలు నెరవేరతాయని భక్తుల విశ్వాసం.



సంక్రాంతి కిట్ల పంపిణీ



రాంపురంలో ప్రజలకు సంక్రాంతి సరకుల కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: సంక్రాంతి పండగ ప్రతీ ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆకాంక్షించారు. సంక్రాంతి పురస్కరించుకుని పెందుర్తి మండలం రాంపురంలోని ప్రతీ ఇంటికీ అదీప్‌రాజ్ ఉచితంగా నిత్యావసర సరకుల కిట్లు శనివారం పంపిణీ చేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, రాంపురం సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ శ్రీరాములు, పార్టీ నాయకులు జగన్, లక్ష్మి, కృష్ణ, రవి, అర్జునరావు, శ్రీను, దేవుడు, అప్పారావు పాల్గొన్నారు.

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రామునాయుడు



సింహాచలం: పెందుర్తి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జిగా గొర్లె రామునాయుడు నియమితులయ్యారు. ఈమేరకు అనకాపల్లి జిల్లా బీజేపీ అధ్యక్షుడు గండి వెంకట సత్యనారాయణ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

అట్టహాసంగా సంక్రాంతి సంబరాలు



చిన్నారులకు భోగిపళ్లు పోస్తున్న మహిళా ట్రస్టీలు



గణేష్‌నగర్ కాలనీలో భోగిమంట

సబ్బవరం: తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. తవ్వవానిపాలెంలో సర్పంచ్ బోకం స్వామినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో హరిదాసు కీర్తనలు,గంగిరెద్దుల కోలాటాలతో పండగను ఉత్సాహంగా నిర్వహించారు. పలు పోటీల విజేతలకు వైఎస్సార్‌సీపీ నాయకుడు బోకం శ్రీనివాసరావు సౌజన్యంతో బహుమతులు అందజేశారు.

- ఇరువాడలో ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన బలిరెడ్డి సుశీలా దేవి, అచ్చియ్యమ్మ, రామలక్ష్మిలకు వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యితో పాటు పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. గ్రామ పెద్దలు బలిరెడ్డి కనకరాజు, ఎంపీటీసీ సభ్యుడు కర్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా భోగి

సింహాచలం: సింహగిరిపై శనివారం జరిగిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా చిన్నారులకు భోగి పళ్లు పోసే కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. పలువురు తల్లిదండ్రులు తమ చిన్నారులను సింహగిరికి తీసుకురాగా వారికి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు పెనుమత్స శ్రీదేవి వర్మ, ముదుండి రాజేశ్వరి భోగిపండ్లు పోశారు. దేవస్థానం అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గోదాదేవి వేషధారణలో చిన్నారులు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులు, యువత

సింహాచలం: సింహగిరిపై స్వధర్మ వాహిని ఆధ్వర్యంలో శనివారం ఆలయ రాజగోపురం వద్ద ఉన్న కళావేదికపై గోదాదేవి అలంకరణ పోటీలు నిర్వహించారు. చిన్నారులు, యువతులు గోదాదేవి అలంకరణలో ఆకట్టుకున్నారు. విజేతలకు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ నగదు బహుమతులు అందజేశారు. అలాగే సింహగిరిపై శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, అధికారులు బహుమతులు అందజేశారు. ఎన్ఏడీ కొత్తరోడ్డుకి చెందిన కె.నాగమణి ప్రథమ బహుమతి పొందగా, శ్రీనివాసనగర్‌కు చెందిన కె.సౌమ్య, మద్దిలపాలేనికి చెందిన ఎస్.సువర్ణ ద్వితీయ,తృతీయ స్థానాల్లో నిలిచారు. సింహగిరికి వచ్చిన భక్తులకు సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు ఆధ్వర్యంలో బూరెలు పంపిణీ చేశారు.

సింహగిరిపై ముగిసిన ధారోత్సవాలు



అప్పన్న , గోదాదేవి ఉత్సవమూర్తులకు స్నపనం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ధారోత్సవాలు శనివారంతో ముగిసాయి. వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవి,గోదాదేవిని ఒక పల్లకిలో, మదన గోపాలస్వామిని వేరొక పల్లకిలో అధిష్టంపజేశారు. సువర్ణ అమ్మవారిని, చతుర్భుజ తాయారు అమ్మవారు, ఆళ్వారులను మరో పల్లకిలో వేంచేయజేశారు. మేళతాళాల మధ్య ఆలయంలో నుంచి తిరువీధిగా గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వేదికపై విశేషంగా స్నపనం నిర్వహించారు. అనంతరం గంగధార వద్ద ఉన్న ప్రాచీన మండపంలో స్వామిని, అమ్మవార్లను అధిష్టంపజేసి విశేష అలంకరణ చేశారు. ముప్పెవ్వై పాశుర విన్నపం చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్,పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు,అర్చకుడు కుమారాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.



వెలుగులోకి మరో సైబర్ క్రైం

ఓ వ్యక్తి ఖాతా నుంచి రూ. 1.62 లక్షలు మాయం

అల్లిపురం : అప్పు తీసుకుని పూర్తిగా తీర్చేసినా లోన్ యాప్ ద్వారా సదరు వ్యక్తిని దోచుకున్న మరో ఘటన విశాఖలో చోటు చేసుకుంది. సైబర్ క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలో అరిలోవ ప్రాంతానికి చెందిన వ్యక్తి సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. వ్యక్తిగత అవసరాల నిమిత్తం పెకిఫర్ లోన్ యాప్ నుంచి డబ్బు తీసుకున్నాడు. కాలపరిమితిలోగా ఆ అప్పును తీర్చేసాడు కూడా. అయినప్పటికీ ఆ కంపెనీ నుంచి ముకేష్ అనే వ్యక్తి ఫోన్ చేసి డిసెంబర్ ఈఎంఐ బ్యాలెన్స్ వుందని.. డబ్బు కట్టాలని చెప్పాడు. తాను ఇది వరకే ఈఎంఐ చెల్లించానని సదరు వ్యక్తి చెప్పాడు. మీరు చెల్లించింది అప్‌డేట్ కాలేదని, ఫోన్ పేలోకి వెళ్లి యూపీఐ నంబర్‌కి తాము చెప్పిన కోడ్ ఎంటర్ చేయమని లోన్‌యాప్ వ్యక్తి తెలిపాడు. దీంతో బాధితుడు అతను చెప్పిన నంబరు ఎంటర్ చేశాడు. అంతే.. బాధితుడి అకౌంట్ నుంచి రూ.1,62,821 మాయమైపోయాయి. దీంతో బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు.

అప్రమత్తంగా ఉండండి..

లోన్ యాప్ ఆగడాలు తగ్గినట్లు తగ్గి మళ్ళీ విజృంభిస్తున్నందున ఎవరూ ఆన్‌లైన్ లోన్లు తీసుకోవద్దని సైబర్ క్రైం సీఐ భవానీప్రసాద్ తెలిపారు. సైబర్ నేరగాళ్ళని నమ్మి మోసపోవద్దన్నారు. అలా ఎవరైనా సైబర్ నేరగాళ్ళ బారిన పడినట్లు అయితే తక్షణమే www. cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. లేదా టోల్ ఫ్రీ నంబర్ 1930లో గాని సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌కు 9490617917 నంబర్‌లో గానీ ఫిర్యాదు చేయాలని తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం విరమించుకోవాలి



ర్యాలీలో సీఐటీయూ నాయకులు

పరవాడ: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫార్మాసిటీలో శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థ స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరణ చేస్తే ఊరుకోబోమని గనిశెట్టి హెచ్చరించారు. కార్మిక చట్టాలను మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చి కార్మికులను బానిసలుగా అప్పగించే చర్యలను సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తుందని గనిశెట్టి పేర్కొన్నారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోనంబర్1ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.అప్పలరాజు, రమణ, శేషు, సత్తిబాబు, రమణ, ముసిలినాయుడు పాల్గొన్నారు.



నేత్రపర్వం.. మకరజ్యోతి దర్శనం



విశేషాలంకరణలో అయ్యప్పస్వామి



జ్యోతి దర్శనం కోసం వచ్చిన భక్తులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద మకరజ్యోతిని మాలధారులు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. మకర జ్యోతి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉక్కునగరం అయ్యప్ప ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అష్టాభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయంలో 18 మెట్లకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామికి సంధ్యా హారతి పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో పడిమెట్ల వద్ద దీపాలు వెలిగించి, చివరి మెట్టు ధ్వజస్తంభం వద్ద సాయంత్రం 6.45 గంటలకు మకర జ్యోతి దర్శనం కల్పించారు. అయ్యప్ప మాలధారులతో పాటు సాధారణ భక్తులు కూడా జ్యోతిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రైళ్ల రీషెడ్యూల్



తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ నుంచి శనివారం రాత్రి బయలుదేరాల్సిన పలు రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఆయా స్టేషన్ల నుంచి పెయిరింగ్ రైళ్లు విశాఖకు ఆలస్యంగా రావడంతో రీషెడ్యూల్ చేశామన్నారు.

- శనివారం రాత్రి 10 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం–న్యూఢిల్లీ(20805) ఏపీ ఎక్స్‌ప్రెస్ ఆదివారం తెల్లవారు 3 గంటలకు బయలుదేరింది.
- శనివారం రాత్రి 11.25 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం–లోకమాన్య తిలక్ టెర్మినస్(18519) ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ మధ్య రాత్రి 1 గంటకు బయలుదేరింది.

ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు..

- సికింద్రాబాద్ డివిజన్ సులేహల్లి స్టేషన్ పరిధిలో గూడ్స్ రైలు పట్టాలు తప్పిన కారణంగా శనివారం మధ్య రాత్రి విశాఖలో బయలుదేరే విశాఖపట్నం–లోకమాన్య తిలక్ టెర్మినస్(18519) ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ మళ్లించిన మార్గంలో వయా వాడి, కాలాబురాగి, హోమ్నబాద్, బీదర్, వికారాబాద్ స్టేషన్ల మీదుగా నడుస్తుంది.

'స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తే సహించం'



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రగతి పథంలో నడుస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను కావాలనే నిర్వీర్యం చేస్తున్నారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాంట్ జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 702వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని ఎల్ఎంఎంఎం మరియు ఎస్‌బీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నాయకులు డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ గతేడాది కరోనా సమయంలో 28వేల కోట్లు టర్నోవర్ చేసిన సంస్థను ఈ ఏడాది ముడి సరుకు అందించకుండా చేసి 1300 కోట్ల నష్టాల వైపు నెట్టారని విమర్శించారు. ఐక్య ఉద్యమాలతో ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామన్నారు. కార్యక్రమంలో వై.మస్తానప్ప, కె.భాస్కరరావు, సీహెచ్. సన్యాసినావు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

